క్లుప్తంగా

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన



నూజెండ్ల: మండలంలోని కొత్తకొత్తపాలెంలో రామాలయ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ జీ.వి.ఆంజనేయులు భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ గ్రామస్తుల చిరకాల కోరిక త్వరగా పూర్తి కావాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక వాతావరణంతో పాటు గ్రామస్తుల్లో భక్తిభావం వెల్లివిరియాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, నాయకులు పాల్గొన్నారు.

ఏరువాక పౌర్ణమిని రైతు దినోత్సవంగా ప్రకటించాలి



నూజెండ్ల: రానున్న ఏరువాక పౌర్ణమి పురస్కరించుకొని ప్రభుత్వం ఉత్తమ రైతు పురస్కారాలు అందించాలని రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము డిమాండ్ చేశారు.మండలంలోని గొల్లపాలెంలో ఆదివారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి నాడు రైతులు వ్యవసాయ పనిముట్లకు పూజలు చేసి, పొలం పనుల్ని సంప్రదాయకంగా ప్రారంభిస్తారని తెలిపారు. అదే రోజు ఏరువాకను ప్రభుత్వం రైతు దినోత్సవంగా ప్రకటించి వ్యవసాయంలో ఎక్కువ దిగుబడులు తెచ్చిన యువ రైతులకు మండల స్థాయిలో ఉత్తమ రైతు అవార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పెద్దారావు, అంజయ్య, సాంబశివరావు ,రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట: పోలిరెడ్డిపాలెం ఫీడర్‌లో లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ ఆర్. అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పోలిరెడ్డిపాలెం, లక్ష్మీ నరసింహ కాలనీ, కోంద్రుపాడు, వైఎస్సార్ కాలనీ, రాజీవ్ గృహకల్ప ప్రాంతాల్లో పైన పేర్కొన్న వేళల్లో సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఫ్యాన్లు ఏర్పాటు

నరసరావుపేట: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్(ఏపీఎస్ఈసీఎం) సంస్థ ప్రయాణికుల సౌకర్యార్థం ఏడు సీలింగ్ ఫ్యాన్లను ఏర్పాటు చేసిందని డిపో మేనేజర్ బూదాటి శ్రీనివాసరావు ఆదివారం వెల్లడించారు. దీని వల్ల తమకు విద్యుత్ ఆదా అవుతుందని తెలిపారు. బస్టాండ్ ఆవరణలో 30 స్టీల్ బెంచీలు, 12 ఫ్యాన్లు, తాగునీరు, మరుగుదొడ్లు, సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బస్టాండ్‌ను ఎప్పటికప్పుడు ఊడ్చి శుభ్రంగా ఉంచుతున్నామని తెలిపారు. ప్రయాణికులంతా ఆర్టీసీ సంస్థను ఆదరించి బస్సుల్లోనే ప్రయాణించాలని ఆయన కోరారు.

లబ్ధిదారులకు వ్యాక్యూమ్ ట్రక్కు అందజేత



నరసరావుపేట: జిల్లా షెడ్యూల్ క్యాస్ట్ సర్వీసెస్ కో-ఆపరేటివ్ సొసైటీ నిధులతో మంజూరైన డిస్లాడ్జింగ్ వ్యాక్యూమ్ ట్రక్కును ఆదివారం ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, డాక్టర్ చదలవాడ అరవిందబాబు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాల కార్పొరేషన్ చైర్మన్ పెద్దాపూడి విజయ్‌కుమార్, రంగిశెట్టి రామకృష్ణ, కొల్లి బ్రహ్మయ్య, వాసిరెడ్డి రవి, పులిమి రామిరెడ్డి, గూడూరు శేఖర్ పాల్గొన్నారు.

సమానత్వం సాధించడమే ఎమ్మార్పీఎస్ లక్ష్యం

నరసరావుపేట: సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను నిర్మూలించి సమానత్వాన్ని సాధించడమే ఎమ్మార్పీఎస్ ఆశయమని జిల్లా కో-ఇన్‌చార్జి చిరుగూరి నాగరాజు మాదిగ పేర్కొన్నారు. స్థానిక కంభంపాలెంలో ఆదివారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ 31 ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ టౌన్ అధ్యక్షులు కలపాల చరణ్ మాదిగ, ప్రధాన కార్యదర్శి బుట్టి మహేంద్ర మాదిగ, ఎమ్మార్పీఎస్ టౌన్ అధ్యక్షులు బూదాల విజయ్ మాదిగ, విద్యార్థి నాయకులు బూదాల కిరణ్ మాదిగ పాల్గొన్నారు.

సాగు సందిగ్ధం.. రైతు అయోమయం

- గతేడాది ధరల పతనం
- పంట కొనుగోలులో ప్రభుత్వం విఫలం
- ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధరలతో సాగుపై రైతుల నిర్ణయం



గణపవరంలో దుక్కి దున్నుతున్న రైతు

నాదెండ్ల: గత ఖరీఫ్ సీజన్‌లో పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో ఈ ఏడాది సాగుపై రైతుల్లో సందిగ్ధం నెలకొంది. పత్తికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు సీసీఐ కొనుగోలు చేసినా, మిర్చి, పొగాకు, అపరాల పంటలకు భారీగా ధరలు పతనమవడంతో తీవ్రంగా నష్టపోయారు.

రైతులను ఇబ్బంది పెట్టిన సీసీఐ అధికారులు

నాదెండ్ల మండలంలో 25 వేల ఎకరాల సాగు భూమి ఉంది. గతేడాది పత్తి 5900 ఎకరాలు, మిర్చి 4400 ఎకరాలు, పొగాకు 600 ఎకరాలు, శనగ రెండు వేల ఎకరాల్లో సాగు చేశారు. గతేడాది పత్తి క్వింటా మద్దతు ధర రూ.7,521 ఉంది. మొదట్లో పత్తిలో తేమశాతం ఎక్కువగా ఉందంటూ సీసీఐ అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేశారు. దీంతో ఆగ్రహానికి గురై జాతీయ రహదారిని దిగ్బంధించి ఆందోళన చేశారు. అప్పట్లో శాసనమండలి సమావేశాల్లో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పత్తి రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో సీసీఐ అధికారులు రైతుల నుంచి 90 శాతం మేర పత్తిని కొనుగోలు చేశారు.

ఆందోళనకు దిగిన మిర్చి రైతులు

గతేడాది మిర్చి క్వింటా ధర రూ.15–18 వేల ధర పలికింది. ఈ ఏడాది అనూహ్యంగా క్వింటా రూ.10–12 వేలకు తగ్గింది.

పగాకుగా మారిన పొగాకు

గతేడాది పొగాకు ధర రూ.18 వేలకు కొనుగోలు చేయగా, నేడు కొనే నాథుడు లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. క్వింటా ధర రూ.2–5 వేల మధ్యనే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే పొగాకు రైతులు రోడ్డెక్కి తమ ఆందోళన తెలియపరిచినా, నేటికీ ప్రభుత్వం నుంచి ఆశించిన ప్రతిస్పందన లేదు.

మేలైన విత్తనాలతో అధిక దిగుబడులు



ఖరీఫ్‌లో రైతులు మేలైన విత్తనాలను ఎంచుకొని సాగు చేయడంతో మంచి దిగుబడులు సాధించుకోవచ్చు. ఈ ఏడాది మిర్చి, పొగాకు సాగు భారీ తగ్గే అవకాశం ఉంది. కొంతమేర పత్తి, కంది సాగు పెరిగే అవకాశం ఉంది.

–ఎ. హరిప్రసాద్, మండల వ్యవసాయాధికారి

కొంత ఆలస్యంగా ఖరీఫ్ సాగు

మే చివరి వారంలో ఉభయ తెలుగు రాష్ట్రాలను రుతుపవనాలు పలకరించినా, కొద్దిరోజులు మినహా వానలు పడలేదు. గత నాలుగు రోజులుగా తీవ్ర ఎండ, వడగాల్పులతో ప్రజలు అల్లాడుతున్నారు. దీంతో రైతుల్లో సందిగ్ధం నెలకొంది. విత్తనాలు నాటాలా లేక వేచి ఉండాలా అని ఆలోచిస్తున్నారు.

అందని ప్రభుత్వ సాయం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా పథకం కింద ప్రతి ఏడాది రూ.13500 చొప్పున ఐదేళ్ల పాటు ప్రభుత్వం మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో సాయం నగదు జమ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఒక్క పైసా సాయం అందలేదు. ప్రస్తుతం ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమవుతున్న తరుణంలో ఈ ఏడాదైనా ప్రభుత్వం నుంచి సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

ఇర్ఫాన్ కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండ

- కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- డెప్యూటీ సీఎం పవన్‌ను దూషించిన కేసులో ఇర్ఫాన్‌ను అరెస్టు చేసిన పోలీసులు



ఇర్ఫాన్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: మండలంలోని ములకలూరు గ్రామానికి చెందిన మాజీ వలంటీరు ఇర్ఫాన్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను దూషించాడనే కారణంతో ఇర్ఫాన్‌ను శనివారం పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి గ్రామానికి వెళ్లి అతడి కుటుంబాన్ని పరామర్శించారు. తల్లిదండ్రులు, భార్యకు ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి తెనాలి పర్యటన సందర్భంగా డెప్యూటీ సీఎంను దూషిస్తూ ఇర్ఫాన్ మాట్లాడాడని కేసు పెట్టారని తెలిపారు. అతడు గత ప్రభుత్వంలో వలంటీర్‌గా ఎంతో బాగా పని చేశాడని పేర్కొన్నారు. ఇర్ఫాన్ అరెస్టుపైన, అతడ్ని కేసు నుంచి బయటికి తీసుచ్చేందుకు పార్టీకి చెందిన లీగల్ టీంతో సంప్రదింపులు చేస్తున్నామని వెల్లడించారు. సోమవారం సంబంధిత కోర్టులో బెయిల్ పిటిషన్ వేసి విడుదల కోసం ప్రయత్నిస్తామని, అవసరమైతే హైకోర్టు కూడా వెళతామని ఆయన పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఇర్ఫాన్ తండ్రి కరిముల్లాతో పార్టీ అగ్రనేతలు సజల రామకృష్ణారెడ్డి, పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మాట్లాడి తెలియచేశారన్నారు. ఇర్ఫాన్‌కి ఏమి జరగకుండా కుటుంబానికి అప్పజెప్పే బాధ్యత పార్టీ తీసుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తన్నీరు శ్రీనివాసరావు, నాయకులు షేక్ కరిముల్లా, బూదాల కల్యాణ్, సయ్యద్ ఖాదర్‌బాషా, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠా మహోత్సవం

- ముత్యాలంపాడు ఆలయానికి పోటెత్తిన భక్తులు
- 40 వేల మందికి అన్న సంతర్పణ



ధ్వజ స్తంభాల ప్రతిష్ఠ

దాచేపల్లి: మండలంలోని ముత్యాలంపాడులో భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి, గంగాదేవి, మహాలక్ష్మీ సహిత గ్రామ నాభిశిల, ప్రసన్నాంజనేయ స్వామి ప్రతిష్ఠా మహోత్సవాలు ఆదివారం కనుల పండువలా జరిగాయి. సచ్చిదానంద సరస్వతి స్వామి ఆశీస్సులతో బ్రహ్మశ్రీ చల్లా శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ నెల 1వ తేదీ నుంచి పూజలు ప్రారంభించారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి ప్రారంభించిన పూజల్లో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. ధ్వజ స్తంభాలు, బొడ్రాయి, నవ గ్రహాలను వైభవంగా ప్రతిష్ఠించారు. అనంతరం దేవతమూర్తుల శాంతి కల్యాణం నిర్వహించారు.



ప్రతిష్ఠించిన ఆంజనేయుడి విగ్రహం

పోటెత్తిన భక్తులు

ముత్యాలంపాడులో దేవాలయాలు, విగ్రహాలు, బొడ్రాయి, ధ్వజ స్తంభాల ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొనేందుకు భక్తులు పోటెత్తారు. ముత్యాలంపాడుతో పాటుగా చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, భక్తులు భారీగా తరలివచ్చారు. మహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. ధ్వజ స్తంభాల వద్ద నవధాన్యాలు వేసి పూజలు నిర్వహించారు. ధ్వజ స్తంభాలను ప్రతిష్ఠించేందుకు భారీ క్రేన్‌లను ఉపయోగించారు. ప్రతిష్ఠ సందర్భంగా ముత్యాలంపాడు ఊరంతా బంధువులు, భక్తులతో కిక్కిరిసింది. ప్రతిష్ఠకు వచ్చిన ఆడపడుచులకు చీరె, జాకెట్ కానుకగా కుటుంబ సభ్యులు అందజేశారు.

40 వేల మంది అన్న సంతర్పణ

ముత్యాలంపాడులో దేవాలయాల ప్రతిష్ఠ సందర్భంగా మహా అన్న సంతర్పణ చేపట్టారు. గ్రామస్థులందరూ కలిసికట్టుగా ఈ కార్యక్రమాలను చేపట్టారు. ప్రతిష్ఠ నేపథ్యంలో 40 వేల మందికిపైగా అన్నదానంలో పాల్గొన్నారు. భక్తులకు అసౌకర్యాలు కలకుండా కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొనటంతో అన్నదానం కార్యక్రమం సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేశారు. దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు.



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

రిషితారెడ్డికి 189వ ర్యాంక్



నరసరావుపేట ఈస్ట్: పట్టణానికి చెందిన కె.ఎ.రిషితారెడ్డి ఆదివారం ప్రకటించిన ఏపీ ఈఏపీసెట్ ఫలితాలలో ఇంజినీరింగ్ విభాగంలో 189వ ర్యాంక్ సాధించింది. పాఠశాల విద్య నుంచి రాణిస్తున్న ఆమె పదవ తరగతిలో 583 మార్కులు సాధించింది. ఇటీవల నిర్వహించిన జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 239 ర్యాంక్, జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 441వ ర్యాంక్ సాధించింది. రిషిత తండ్రి కొలుకుల రాయపరెడ్డి ప్రైవేటు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా, తల్లి రాజేశ్వరి ప్రభుత్వ ఉపాధ్యాయినిగా పని చేస్తున్నారు. తనకు వచ్చిన ర్యాంక్‌తో ఐఐటీ ముంబై, ఢిల్లీ, చెన్నైలో సీటు లభిస్తుందని, కంప్యూటర్ సైన్స్‌లో ఆసక్తి ఉన్నట్టు తెలిపారు.

బాలికల హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

వినుకొండ: కారంపూడి రోడ్డులో గల బీసీ బాలికల వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వార్డెన్ పి.రత్నకుమారి తెలిపారు.ఇంటర్, డిగ్రీ, ఒకేషనల్, పలు ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులు, ఈబీసీ కేటగిరీకి చెందిన వారు కూడా అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8639189463 నంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

పట్టణాభివృద్ధికి కృషి

మాచర్ల రూరల్: పట్టణంలోని 7వ వార్డులోని కిడ్స్ పాఠశాల వద్ద రూ.50 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్, వైస్ చైర్మన్‌లు పోలూరి నరసింహారావు, యర్రాకుల సిద్దమ్మ, టీడీపీ నాయకులు వై.కేశవరెడ్డి, కొమెర దుర్గారావు, గట్ల కోటిరెడ్డి, కమిషనర్ డి.వేణుబాబు, కేసీపీ సిమెంట్స్ జీఎం వెంకటరమణ, నారాయణ పాల్గొన్నారు.

సత్రశాలలో కృష్ణవేణి అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠ



కృష్ణవేణి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల: రాష్ట్రంలోనే అతి పురాతనమైన శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న సత్రశాల గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం నుంచి పవిత్ర కృష్ణానదికి వెళ్లే మెట్ల వద్ద కృష్ణవేణి అమ్మవారి విగ్రహాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రతిష్ఠ క్రతువును నిర్వహించగా, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదివారం ప్రతిష్ఠించారు. అనంతరం ఎమ్మెల్యే గర్భాలయంలో కొలువుతీరిన పరమేశ్వరుడుకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యేకు దేవస్థానం ప్రధాన అర్చకులు పూర్ణకుంభం, మంగళ వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. దేవస్థానం ఆవరణలో ఆయన కూటమి నేతలతో కలిసి వివిధ రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు సీహెచ్. అబ్బిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, పార్టీ నాయకులు గొట్టం శ్రీనివాసరెడ్డి, లింగా పున్నారావు, బి.రామకృష్ణ, మున్నా ప్రభురాజు, అల్లం బ్రహ్మారెడ్డి, నీలం మల్లయ్య, ఎన్.నర్సింహారావు, సత్రశాల కార్తికమాసం అన్నదాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి వారధి ఫౌండేషన్ అండ

దాచేపల్లి: నిరుపేద విద్యార్థినికి వారధి ఫౌండేషన్ అండగా నిలిచింది. మండలంలోని శ్రీనగర్‌కి చెందిన పులిపొంగు సాగర్ కుమార్తె శ్రావణి చదువు నిమిత్తం ఫౌండేషన్ ద్వారా వ్యవస్థాపకులు తగరం ఆనంద్‌కుమార్ ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. శ్రావణి డిప్లొమా చదువుతోంది. ఆమె తండ్రి సాగర్ అనారోగ్యంతో ఇటీవల చనిపోయాడు. దీంతో శ్రావణి చదువులకు ఆటంకం కలిగింది. విషయం తెలుసుకున్న వారధి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తగరం ఆనంద్‌కుమార్ ఈ ఏడాది ఫీజుకు సంబంధించి రూ.74,500ను నేరుగా కళాశాల యాజమాన్యానికి చెల్లించారు.

వైభవంగా అద్దంకమ్మ తల్లి జాతర



శావల్యాపురం: మండలంలోని చినకంచర్లలో గల శ్రీ అద్దంకమ్మ తల్లి కొలుపుల జాతర ఆదివారంతో ముగిసింది. మహిమ కల్గిన తల్లి జాతరను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈనెల 6న ప్రారంభమైన ఉత్సవాల చివరి రోజు ఉదయం దేవాలయ ప్రాంగణంలో మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి సమర్పించారు. పసుపు–కుంకుమ నూతన వస్త్రాలను అందజేశారు. సాయంత్రం పండుగ వాతావరణంలో కులమతాలు పార్టీలకు అతీతంగా బోనాలను తలపై పెట్టుకొని అమ్మవారికి సమర్పించారు. కుంకుమ బండ్లను ఊరేగింపుగా మేళతాళాల నడుమ గ్రామంలో ఊరేగించి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి మూల విరాట్‌ను పట్టు వస్త్రాలు, పూలదండలతో అలంకరణ చేశారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలు, పూలదండలతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు.

'షైనింగ్ స్టార్' పురస్కారాలకు విద్యార్థుల ఎంపిక



దేవిశ్రీ



షేక్ అఖిల్



జయలక్ష్మి



శ్యామ్‌ప్రసాద్



వంశీకృష్ణ

యడ్లపాడు: పదో తరగతిలో ప్రతిభను చాటిన యడ్లపాడు మండలానికి చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 'షైనింగ్ స్టార్' అవార్డులకు ఎంపికయ్యారు.సెయింట్ ఆన్స్ స్కూల్(యడ్లపాడు)కు చెందిన నర్రా దేవిశ్రీ (571 మార్కులు) , శ్రీశ్రీ రవిశంకర్ సేవా మందిర్ ఆశ్రమ పాఠశాల(కొత్తపాలెం) విద్యార్థి షేక్ అఖిల్ (577), జెడ్పీ హైస్కూల్(ఉన్నవ) విద్యార్థిని ఖరీదు జయలక్ష్మి (570), నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్(యడ్లపాడు) విద్యార్థి అత్తోట శ్యాంప్రసాద్ (569), ఇదే పాఠశాల ఎస్సీ విద్యార్థి గర్నెపూడి వంశీకృష్ణ (565) ఎంపికయ్యారు. ఈ ఐదుగురికి జూన్ 9న నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్ హాల్లో జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో అవార్డు కింద ఒక్కొక్కరికీ రూ.20వేల చొప్పున నగదు బహుమతి, జ్ఞాపిక, ధ్రువపత్రాలు అందజేయనున్నారు. అవార్డుకు ఎంపికైన విద్యార్థులు, పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను యడ్లపాడు ఎంఈవోలు ఎం. నాగరత్నం, ఎం. అరుణకుమారి, తహసీల్దార్ జెట్టి విజయశ్రీ, ఎంపీడీవో వి. హేమలతాదేవి అభినందించారు.

శావల్యాపురం మండలం నుంచి ఆరుగురు..

శావల్యాపురం: 2024–25 విద్యా సంవత్సరంలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో అత్యంత ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రభుత్వం నగదు పారితోషకంతో పాటు మెమెంటోను అందజేస్తోందని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి పద్మనాభుని జ్యోతిర్మయి (587), లింగాల గాయత్రి (586) చెన్నంశెట్టి శివ నాగలక్ష్మి (584) అమృతపూడి అమృత వర్షిణి(573), వేల్పూరు జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి రోషిణి(584), పోట్లూరు నుంచి సొలస రూపశ్రీ (582) పురస్కారాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

నూజెండ్ల మండలం నుంచి ఆరుగురు...

నూజెండ్ల: పదవ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఆరుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపికైనట్లు ఎంఈవో రవిచంద్ర తెలిపారు. నూజెండ్ల జెడ్పీ పాఠశాల నుంచి నీలబోయిన స్వాతి, మండడపు దేవిశ్రీ , అప్పిశెట్టి కాశీ వినోద్, ఉప్పలపాడు గురుకుల పాఠశాల నుంచి దారా హవీలా, దోర్నల కీర్తి, పాత నాగిరెడ్డి పల్లె పాఠశాల నుంచి రాతం మణిసాయి ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం



పిడుగురాళ్ల మార్కెట్ యార్డ్‌లో యోగా చేస్తున్న అధికారులు



మున్సిపల్ కార్యాలయ ఆవరణలో యోగా నిర్వహిస్తున్న సీనియర్ సిటిజన్స్

పిడుగురాళ్ల: యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని గురువు అరవపల్లి రమేష్ తెలిపారు. అంతర్జాతీయ యోగా మాసోత్సవం సందర్భంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని మార్కెట్ యార్డులో ఆదివారం యోగాను నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ యోగాను ప్రతిరోజు ఉదయాన్నే ధ్యానంతో చేస్తే ఆరోగ్యం అదుపులో ఉండటమే కాకుండా నలుగురికి ఆదర్శంగా నిలుస్తారని తెలిపారు. ప్రభుత్వం కూడా యోగాను ప్రోత్సహించడం ఎంతో అభినందనీయమని చెప్పారు.

యోగాతో మానసిక ఉల్లాసం

మాచర్ల రూరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని రిటైర్డ్ డెప్యూటీ డీఈఓ గాదె రామకృష్ణారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో యోగా మాసోత్సవాలను పురస్కరించుకొని సీనియర్ సిటిజన్స్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు యోగా వల్ల ఎంతో మానసిక ఉల్లాసం ఏర్పడుతుందని తెలిపారు. సీనియర్ సిటిజన్స్ అంతా క్రమం తప్పకుండా ప్రకృతి సిద్ధమైన గాలి, ప్రశాంత వాతావరణంలో యోగా ప్రాక్టీస్ చేస్తే ఎంతో ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 21న విశాఖలో జరగబోయే యోగా డేని పురస్కరించుకొని నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు, రిటైర్డ్ హెచ్ఎం ముత్యాల పాపిరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..



పూర్వ గురువులతో 2011-2012 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

రెంటచింతల: స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో 2011–2012 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆడిటోరియంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కరస్పాండెంట్ ఫాదర్ గోవిందు బాలస్వామి, హెచ్ఎం దుర్గాప్రసాద్, ఆనాడు తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు తుమ్మా లూర్దురెడ్డి, కె. చిన్నపురెడ్డి, వై. ఫాతిమా మర్రెడ్డి, బి.థామస్‌లను ఘనంగా సత్కరించారు. విద్యార్థులంతా వేదికపై తమను పరిచయం చేసుకున్నారు. పూర్వమిత్రులను 13 సంవత్సరాల అనంతరం కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, ఉపాధ్యాయులు నేర్పిన నైతిక విలువలతో కూడిన విద్యకారణంగానే ఉన్నత స్థాయికి చేరుకున్నామని పుల్లా ఫ్రాన్సిస్ తెలిపారు.

ప్రతిష్ఠా మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే కాసు పూజలు



ప్రతిష్ఠించిన ధ్వజస్తంబాల వద్ద పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: మండలంలోని ముత్యాలంపాడు గ్రామంలో జరిగిన దేవాలయాలు, బొడ్రాయి, ధ్వజస్తంభాల ప్రతిష్ఠా మహోత్సవంలో గురజాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదివారం పాల్గొన్నారు. గ్రామ పొలిమేరల నుంచి కాసుని మేళతాళాలతో గ్రామంలోకి తీసుకెళ్లారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు కాసుని శాలువా, పూలదండలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఎనుముల మురళీధర్‌రెడ్డి, వైద్యుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి ఆశోక్‌కుమార్, ఎంపీపీ కందుల జాను, జెడ్పీటీసీ మూలగొండ్ల కృష్ణకుమారి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొట్టిముక్కల పెద హనిమిరెడ్డి, నాయకులు మందపాటి రమేష్‌రెడ్డి, కొప్పుల సాంబయ్య, కొమ్మినేని వెంకటేశ్వరరావు(కేవీ), కోట కృష్ణ, షేక్ సుభాని, షేక్ జాకీర్ హుస్సేన్, సర్పంచి నెమలికంటి వెంకటాచారి, ఎంపీటీసీ పాస వెంకట నాగయ్య పాల్గొన్నారు.